# ముగిసిన గయూమ్ అంకం..

**ద్వీపాల సముదాయం మాల్దీవుల్లో... 30 ఏళ్ల గయూమ్ పాలన ముగిసింది. మిత్రులు నెల్సన్ మండేలాతో పోల్చే.. మొహమద్ నషీద్ శకం ప్రారంభమైంది. మాల్దీవుల్లో శాంతియుత అధికార మార్పిడిపై అమెరికా సంతోషం వ్యక్తంచేసింది. మాల్దీవుల్లో పాగా వేయటానికి, స్థావరాలు ఏర్పరచుకోవటానికి చైనా ఎప్పటినుంచో ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యం దృష్ట్యా.. మాల్దీవులతో స్నేహపూరిత సంబంధాలు భారత్‌కు ఎంతో అవసరం!!**

మాల్దీవుల్లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీకి చెందిన (Mohamad Nasheed) మొహమద్ నషీద్ దేశ నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనకు 54 శాతం ఓట్లు రాగా... ప్రత్యర్థి మౌమూన్ అబ్దుల్ గయూమ్‌కు 46 శాతం ఓట్లు వచ్చాయి. దీంతో 30 ఏళ్లుగా కొనసాగుతున్న అబ్దుల్ గయూమ్ పరిపాలన ముగిసినట్లైంది. ఫలితాలు వెలువడిన అనంతరం అబ్దుల్ గయూమ్ మాట్లాడు తూ.. ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును తాను పూర్తిగా గౌరవిస్తూ.. నూతన ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తానని చెప్పారు. ఎటువంటి హింస, రక్తపాతం లేకుండా మాల్దీవుల ప్రజలు ఎన్నికల ప్రక్రియలో పాలుపంచుకొని... దేశంలో ప్రజాస్వామ్య పునాదులు పటిష్టమయ్యాయన్న సత్యాన్ని రుజువు చేశారన్నారు. 30 ఏళ్లపాటు మాల్దీవులను నిరాటంకంగా పరిపాలించిన గయూమ్... ఆసియా ఖండంలోనే అత్యధిక కాలం దేశాధినేతగా ఉన్న నాయకుడిగా ఖ్యాతి గడించారు.

అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం మొహమద్ నషీద్ మాట్లాడారు. ‘‘దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేస్తా. ప్రజలిచ్చిన సాహసోపేతమైన తీర్పును పూర్తిగా అమలు చేస్తాం. పూర్వ అధ్యక్షుడు అబ్దుల్ గయూమ్ పరిపాలనలో జరిగిన పొరపాట్లను తవ్వుకుంటూ.. ఆయన్ను ఇబ్బంది పెట్టం. పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశంగా మాల్దీవులను తీర్చిదిద్దుతాం. బహుళపార్టీ ప్రజాస్వామ్య వ్యవస్థ మాల్దీవుల్లో మనగలగటానికి అవసరమైన అన్ని నిర్మాణాత్మక కార్యక్రమాలను బలోపేతం చేస్తాం. సునామీ తాకిడికి భారీగా దెబ్బతిన్న ప్రాంతాల్లో పునఃనిర్మాణం చేపడతాం. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయటం.. పాలనా సంస్కరణలను వేగవంతం చేయటం.. అధికార మార్పు ద్వారా దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత వేళ్లూనుకునేలా చూడటం.. తదితర అన్ని చర్యలు తీసుకుంటాం. మాల్దీవుల్లో ఏ రాజకీయ పార్టీ నాయకుడి పైనా, గత ప్రభుత్వంలో పనిచేసిన వారిపైనా.. ఎలాంటి చర్యలు చేపట్టబోం. గతంలో వారేమైనా తప్పులు చేసుంటే... పెద్ద మనసుతో వారిని క్షమిస్తాం. తద్వారా దేశంలో ఆరోగ్యకరమైన ప్రజా సంస్కృతికి బాటలు వేస్తాం’’అని నషీద్ స్పష్టంచేశారు. మాల్దీవుల్లో శాంతియుతంగా అధికార మార్పిడి జరగడం పట్ల అమెరికా సంతోషం వ్యక్తం చేసింది.

## నషీద్ విజయం వెనుక :

ప్రజలు 'అన్నీ'(Anni) అని పిలిచే నషీద్‌ను.. మిత్రులు నెల్సన్ మండేలాతో పోలుస్తారు. అబ్దుల్ గయూమ్ పాలనను నషీద్ మొదటి నుంచీ నిశితంగా విమర్శించేవారు. ప్రభుత్వానికి వ్యతి రేకంగా ప్రత్యక్ష చర్యకు దిగాల్సిందిగా ప్రజలకు నషీద్ ఇచ్చిన పిలుపు హింసాత్మకంగా మారి, ఆయన జైలుకు వెళ్లిన సందర్భాలు అనేకం. పాత చింతకాయ పచ్చడి లాంటి గయూమ్ పాలనకు కాలం చెల్లిందని.. ప్రపంచీకరణ యుగంలో వేగంగా అభి వృద్ధి చెందాలంటే ప్రైవేటీకరణ ద్వారా ఆర్థిక వ్యవస్థను బలో పేతం చేయాల్సి ఉంటుందనీ.. ఆధునిక సమాజంలో ప్రజలు ఎదుర్కొనే ఆర్థిక సమస్యలను పరిష్కరి ంచటానికి ఆర్థిక విధానాలతోపాటు రాజకీయ విధానంలో కూడా మార్పు అవసరమనీ... ఆ మార్పు తీసుకురావటానికి తనకు అవకాశం ఇవ్వాలంటూ... ఎన్నికల సందర్భంగా నషీద్ ప్రజలకు పిలుపునిచ్చారు. 1990ల నుంచి ఒక జర్నలిస్టుగా ప్రభుత్వంపై వాడి వేడి విమర్శలు సంధిస్తూ వార్తల్లోకి ఎక్కిన నషీద్... తన ప్రభుత్వ వ్యతిరేక విమర్శల కారణంగా.. అనేకసార్లు జైల్లో ఉండాల్సి వచ్చింది. జైల్లో ఉన్నప్పుడే మాల్దీవుల చరిత్రపై ఆయన మూడు పుస్తకాలు రాశారు. 1999లో పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైనా, దేశ మాజీ అధ్యక్షుడు ఇబ్రహీం నాజర్ ఇంటి నుంచి కొన్ని ఫైళ్లను దొంగతనంగా తీసుకెళ్లారన్న అభియోగంపై రాజీనామా చేయాల్సి వచ్చింది. 2001లో దేశాధ్యక్షుడు అబ్దుల్ గయూమ్‌ను వ్యతిరేకిస్తున్న రాజకీయ వాదులనంతా ఏకతాటిపైకి తెచ్చి... 'మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ'ని స్థాపించటానికి నషీద్ చేసిన ప్రయత్నం విఫలమైంది.

2003లో నసీమ్ అనే ఓ యువకుడి మరణంపై జైల్లో తలెత్తిన వివాదం... ఆయన్ను ప్రతిపక్ష పార్టీలకు కేంద్రబిందువుగా మార్చింది. మొదట్లో సాధారణ మరణంగా భావించిన నసీం మృతికి.. జైలు అధికారుల హింసాత్మక పద్ధతులే కారణమని, శవ పరీక్షలో తేలడంతో... పెద్దఎత్తున హింసాత్మక సంఘటనలు చోటుచేసుకొన్నాయి. పరిస్థితిని అదుపులోకి తేవటానికి పోలీసులు జరిపిన కాల్పుల్లో మరో ముగ్గురు ఖైదీలు మరణించారు. ఈ సంఘటన విపక్షాల ఐక్యతకు దారితీసింది. ఫలితంగా.. 2005లో ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి నషీద్ నాయకత్వంలో మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ (ఎమ్‌డీపీ)గా అవతరించింది. అయినా పరిస్థితిలో ఆశించిన మార్పు రాకపోవటంతో... నషీద్ 2006లో మాల్దీవుల్లో విప్లవానికి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మార్పు అనేది శాంతియుత ప్రక్రియ ద్వారానే రావా లనీ... విప్లవం, హింస ద్వారా కాదని, కొంతమంది సీనియర్ ప్రతిపక్ష నాయకులు, నషీద్ నాయకత్వంలోని ఎమ్‌డీపీ నుంచి వైదొలిగారు. అప్పటినుంచి శాంతియుత పద్ధతుల ద్వారానే పార్టీని నడిపిస్తూ... ప్రధాన ప్రతిపక్ష పార్టీగానే కాకుండా అధ్యక్షుడు గయూమ్‌కు గట్టి పోటీదారుగా ఎదిగారు. బ్రిటన్‌లో ఉంటూనే పార్టీని నడిపించారు. మాల్దీవుల్లో ప్రజాస్వామ్య సంస్కరణలు బలోపేతమై... 2005లో రాజకీయ పార్టీలపై నిషేధాన్ని ఎత్తివేసిన తర్వాత స్వదేశానికి తిరిగి వచ్చారు. అక్టోబర్ 8, 2008న జరిగిన మొదటి రౌండు అధ్యక్ష ఎన్నికల్లో... దేశాధ్యక్షుడు అబ్దుల్ గయూమ్, ఎండీపీ నేత

నషీద్‌తో పాటు మరో నలుగురు అభ్యర్థులు పోటీపడ్డారు. మాల్దీవుల ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం... 86 శాతం మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దేశాధ్యక్షుడు అబ్దుల్ గయూమ్ కూడా తన ఓటు వేయటానికి గంటసేపు క్యూలో నిలబడాల్సి వచ్చిందంటే.. పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మొదటి రౌండ్ ఎన్నికల్లో అధ్యక్షుడు అబ్దుల్ గయూమ్ మొదటి స్థానంలోనూ.. నషీద్ రెండో స్థానంలోనూ నిలిచారు. అయితే, రాజ్యాంగం ప్రకారం... అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించటానికి పోలైన ఓట్లలో 50 శాతం కంటే ఎక్కువ ఓట్లు సాధించాల్సి ఉంది. దాంతో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన ఇద్దరు అభ్యర్థుల మధ్య రెండో రౌండు ఎన్నిక అనివార్యమైంది. దేశంలో ప్రజాస్వామ్య సంస్కరణలను ముందుకు తీసుకువెళ్లటానికీ... దేశ ఆర్థిక వ్యవస్థకు మూలాధారమైన పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయటానికి... తనను ఎన్నుకోవాలంటూ గయూమ్ ప్రజలను కోరారు. అంతేకాక, పెరుగుతున్న సముద్రమట్టంతో పొంచి ఉన్న ప్రమాదాన్ని అరికట్టటానికీ... అంతర్జాతీయస్థాయిలో మాల్దీవుల గొంతు వినిపించటానికీ... తనలాంటి అనుభవజ్ఞుడైన నేతను ఎన్నుకోవటం మాల్దీవులకు ఎంతో అవసరమనీ కూడా ఆయన చెప్పారు. ప్రతిపక్ష ఎమ్‌డీపీ నేత నషీద్ మాత్రం.. 30 ఏళ్ల అబ్దుల్ గయూమ్ పాలనలో విసిగిపోయి మార్పు కోరుకుంటున్న ప్రజలు.. తనకు ఒక్క అవకాశాన్నిస్తే... కింది స్థాయి వరకూ అసలు సిసలైన ప్రజాస్వామ్యాన్ని అందిస్తాననీ ఓటర్లకు వివరించారు. మొదటి రౌండులో గయూమ్ కంటే వెనుకబడిన నషీద్ వ్యూహాత్మకంగా... మొదటి రౌండులో పోటీచేసిన అభ్యర్థులను తనవైపు తిప్పుకుని విజయం సాధించారు.

## గతం :

హిందూ మహాసముద్రంలో శ్రీలంకకు దక్షిణ పశ్చిమంగా ఉన్న దాదాపు 1192 ద్వీపాల సముదాయమే మాల్దీవులు. భారత దేశానికి చెందిన లక్షదీవులకు కూడా మాల్దీవులు దక్షిణంగా ఉన్నాయి. ప్రారంభంలో హిందూమతాన్ని.. అశోకుడి కాలంలో బౌద్ధమతాన్ని... ఇక్కడి ప్రజలు ఆదరించినట్లు చరిత్రకారుల అభిప్రాయం. క్రీ.శ.1153లో ఇక్కడ ఇస్లాం మతం ప్రారంభ మైంది. తర్వాత పోర్చుగీస్, డచ్ ఈ దీవులను ఆక్రమించినా... 18వ శతాబ్దం చివర్లో బ్రిటిషర్ల నియంత్రణలోకి వచ్చింది. 1887లో బ్రిటిషర్ల ఆధీనంలోనే ఉంటూ... స్థానికంగా తనను తాను పరిపాలించుకునే విధంగా ఉంటూ వచ్చింది మాల్దీవులు. 1932లో తొలి రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకుంది. 1953లో కామన్‌వెల్త్‌లో భాగంగా ఉంటూ... తనను తాను రిపబ్లిక్‌గా ప్రకటించుకుంది. దేశాధ్యక్షుడిగా 'సుల్తాన్' (రాచరిక వ్యవస్థ) ఉంటూ వచ్చాడు. 1965లో కామన్‌వెల్త్ నుంచి బయటపడి, పూర్తి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకుంది. 1968లో జరిగిన రెఫరెండంలో... సుల్తాన్‌ను ప్రజలు తిరస్కరించారు. దాంతో ఇబ్రహీం నాజర్ దేశాధ్యక్షుడిగా... రిపబ్లిక్ ఆఫ్ మాల్దీవ్స్ పూర్తి స్వతంత్ర దేశంగా.. ఆవిర్భవించింది. పదేళ్ల పాటు పాలించిన అనంతరం నాజర్ తప్పుకోవడంతో.. మౌమూన్ అబ్దుల్ గయూమ్ దేశాధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. 1980 లలో దేశంలో పర్యాటక రంగం అభివృద్ధికి గయూమ్ కృషి చేయడంతో.. దేశ ఆర్థిక వ్యవస్థ గాడిన

పడింది. 1982లో మాల్దీవులు తిరిగి కామన్‌వెల్త్ (ఒకప్పుడు బ్రిటిషర్ల పాలనలో ఉండి, తర్వాత స్వతంత్ర దేశాలుగా ఆవిర్భవించిన దేశాల సముదాయం)లో సభ్యదేశంగా చేరింది. 1980లలోనే గయూమ్‌ను పదవీచ్యుతుడ్ని చేయటానికి మూడుసార్లు విఫల ప్రయత్నాలు జరిగాయి. 1988లో జరిగిన విద్రోహ చర్యలో మాల్దీవుల రాజధాని 'మాలే'లో గయూమ్‌పై కొందరు తిరుగుబాటు చేయటంతో.. ఆయన భారతదేశం సాయాన్ని కోరాడు. ఆపదలో ఉన్న గయూమ్‌ను రక్షించడానికి భారత్ తన వైమానికదళాన్ని, నావి కాదళాన్ని ఉపయోగించి... ఆపరేషన్ సీఏసీటీయూఎస్ (కాక్టస్) ద్వారా ఆయనకు సాయపడింది.

1999లో దేశంలో పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. రాజకీయ పార్టీలకు గుర్తింపు లేకపోవడంతో పార్లమెంటు (మజిలిస్)లోని 40 సీట్లలో మెజారిటీ స్థానాలకు గయూమ్‌ను సమర్థించే ఇండిపెండెంట్లే ఎన్నికయ్యారు. డిసెంబర్ 26, 2004న హిందూ మహాసముద్రంలో ఏర్పడ్డ భూకంపంతో సంభవించిన సునామీ తాకిడికి 9 ద్వీపాలు మినహాయించి, మిగతా ద్వీపాలన్నీ ఘోరంగా దెబ్బతిని, దాదాపు 400 మిలియన్ డాలర్ల మేర ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లింది. ఇది మాల్దీవుల జీడీపీ (స్థూల జాతీయోత్పత్తి) లో 62 శాతం. సునామీ దెబ్బ నుంచి తేరుకుంటుండగానే.. 2005లోరాజకీయ పక్షాలను గుర్తించాలనీ, బహుళపార్టీ ప్రజా స్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేయాలంటూ.. ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. దాంతో దేశంలో బహుళపార్టీ ప్రజాస్వామ్యాన్ని ప్రవేశపెట్టడానికి అధ్యక్షుడు గయూమ్‌తో పాటు పార్ల మెంటు కూడా ఆమోదాన్ని తెలిపింది. 2006లో గయూమ్ దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయటానికి ఒక 'ముసాయిదా' ప్రణాళికను రూపొందించి, అమలుచేయటం ప్రారంభించారు. మానవ హక్కులు, వ్యక్తి స్వేచ్ఛ, స్వతంత్ర్య న్యాయ వ్యవస్థ, బహుళ రాజకీయ పార్టీల గుర్తింపు మొదలైనవి ఇందులోని ముఖ్యాంశాలు. ఆగస్టు 2008న పార్లమెంటు ఆమోదించిన ఈ ముసాయిదా ప్రణాళిక ద్వారా... దేశంలో శాసన, న్యాయ, కార్య నిర్వాహక వ్యవస్థల హక్కులు, అధికారాల నిర్వచనంతో పాటు స్వయంప్రతిపత్తితో పనిచేసే ప్రణాళికకు ఆమోదం పడింది. ఈ కొత్త రాజ్యాంగంలోనే..న్ని రాజకీయ పార్టీలను గుర్తించి, వాటిని రాబోయే అధ్యక్ష ఎన్నికల్లో పాల్గొననివ్వాలని పొందుపరిచారు. అందులో భాగంగానే అక్టోబర్‌లో బహుళపార్టీ ప్రజాస్వామ్యం ఆధారంగా అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. కొత్త రాజ్యాంగాన్ని ఆమోదించటానికి ముందు రాజకీయ పార్టీలపై అధికారిక నిషేధం లేకపోయినా... అబ్దుల్ గయూమ్ అనుయాయులు ప్రతిపక్షాలను ఎదగనివ్వలేదనే విమర్శ ఉంది. కొత్త రాజ్యాంగం, తాజా అధ్యక్ష ఎన్నికలు, మాల్దీవులను పూర్తి స్థాయి ప్రజాస్వామిక దేశంగా రూపొందటంలో దోహదం చేశాయి.

### కొత్త అధ్యక్షుడి తక్షణ కర్తవ్యం:

సముద్రమట్టానికి కేవలం 1.8 మీటర్లు (6 అడుగులు) ఎత్తులో ఉండే మాల్దీవులు.. ప్రపంచ పర్యావరణ మార్పులవల్ల ప్రభావితమయ్యే జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రపంచంలో పెరుగుతున్న పారిశ్రా మికీకరణ, కార్బన్ ఇంధనాల వినియోగం.. తద్వారా పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల ధ్రువాల వద్ద మంచు

కరిగి, సముద్రమట్టాలు పెరుగుతుండటం.. తదితర పర్యావరణ కారణాల వల్ల మాల్దీవుల భవితవ్యం ప్రశ్నార్థకం అయింది. తనలాంటి మరికొన్ని దేశాల సహాయంతో ప్రపంచ వేదికలపై తన వాణిని మాల్దీవులు సమర్థంగా వినిపించాల్సి ఉంటుంది. లేకపోతే, పర్యావరణంలో ఏర్పడే విపరీత మార్పుల వల్ల సముద్రమట్టం పెరిగితే.. మాల్దీవులు ప్రపంచ పటం నుంచి మాయమయ్యే ప్రమాదం పొంచి ఉంది. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా టూరిజంపై ఆధారపడి ఉంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఏర్పడ్డ మాంద్యం పర్యాటక రంగాన్ని తాకితే మాల్దీవుల ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమవుతుంది. అందువల్ల ఆర్థిక వనరుల కోసం ప్రత్యామ్నాయ వనరుల అన్వేషణ అత్యవసరం. మరోవైపు భారతదేశ వ్యూహాత్మక ప్రయోజనాల దృష్ట్యా.. మాల్దీవుల ఉనికి ఎంతో మహత్తరమైంది. చివరిగా.. ఇప్పటికీ అత్యధిక ప్రజాకర్షణ కలిగిన నాయకుడు గయూమ్ అనుభవాన్నిరానున్న రోజుల్లో కొత్త ప్రభుత్వం ఎలా సద్వినియోగం చేసుకోగలదనే దానిపై కూడా మాల్దీవుల భవితవ్యం ఆధారపడి ఉంది. ఎందుకంటే... కొత్త అధ్యక్షుడు మహ్మద్ నషీద్‌కు ప్రభుత్వాన్ని విమర్శించటంలో మంచి నేర్పు ఉంది.. కానీ, ప్రభుత్వాన్ని నడపటంలో అనుభవం శూన్యమనే విమర్శ ఉంది!!

SAKSHI